క్లుప్తంగా

నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు

నందిగామ టౌన్: పట్టణంలో అభివృద్ధి చేసిన పలు పనులను గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ శుక్రవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆరవ వార్డులో రూ. 60 లక్షలతో చేపట్టిన డ్రైన్, వాక్ వే, ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తుండగా రూ. 22 లక్షలతో ఆధునీకరించిన బాబు జగ్జీవన్ రామ్ భవనాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల మన్ననలు పొందుతున్న డూలాస్ ట్రస్ట్



నందిగామ: నందిగామ ప్రాంతంలో డూలాస్ ట్రస్ట్ నిత్యం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. స్థాపించిన కొద్ది సంవత్సరాల్లోనే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఎన్ఆర్ఐ డాక్టర్ మణిఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డూలాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు బట్టలు పంపిణీ, విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ వంటి అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవసహాయం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


కబడీ ఆడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు దేవమణి


సెమీ ఫైనల్స్‌లో గెలిచిన పెండ్యాల జట్టు

వత్సవాయి: 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలకేంద్రం వత్సవాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. గురువారం పోటీలను ఎంపీడీఓ రమేష్‌బాబు ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచ్ భూక్యా సీతమ్మ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కబడీ ఆడారు. కబడీతో పాటు, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, యేశపోగు శ్రీనివాస్, కొలుసు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో గురువారం వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హర్షసాయి, ఏఓ సిద్ధారెడ్డి, పీడీ వెంకటరమణ, బాబూప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి, కంచికచర్ల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా పీఈటీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాలు గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు దోహదపడతాయన్నారు. కంచికచర్లలో జరిగిన సెమీఫైనల్స్ క్రికెట్ పోటీల్లో కంచికచర్ల-3 జట్టు గెలిసింది. అలాగే గొట్టుముక్కల జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో గండేపల్లి గెలిచింది. గండేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో పెండ్యాల జట్టు గెలిచింది. సెమీ ఫైనల్స్‌లో గెచిలినవారు శుక్రవారం ఫైనల్స్ ఆడతారని పీఈటీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


మున్నలూరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

మున్నలూరు(కంచికచర్ల): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని మున్నలూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. సీఎం జగనన్న తిరిగి అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయల నరసింహారావు, తేళ్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల నరసింహారావు, తేళ్ల నరసింహారావు, గురవయ్య, మార్త శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తబెల్లం కొండవారిపాలెం గ్రామంలో..

నందిగామ టౌన్: మండలంలోని పెద్దవరం శివారు కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కి రానున్న ఎన్నికల్లో పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణ, శివనాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలి

వీరులపాడు: కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయించుకునేలా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మీ సూచించారు. వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో సుఖప్రసవం అయ్యేలా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రులో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మీ, కన్నమాల సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యుడు మండూరి ప్రకాశరావు, వైద్యాధికారి దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

రంగుల మహోత్సవాలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిబాబు, పక్కన ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు


సమావేశంలో పాల్గొన్న ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు, సభ్యులు

పెనుగంచిప్రోలు: అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీ తిరుపతమ్మవారి రంగుల, కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీఓ పి.సాయిబాబు అన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి జరిగే అమ్మవారి రంగుల మహోత్సవాలకి సంబంధించి గురువారం ఆలయ ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలని చెప్పారు. దేవతామూర్తుల విగ్రహాలు తీసుకెళ్లే ఎడ్లబండ్లకు రాజకీయ పార్టీల జెండాలు, ఫొటోలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జగ్గయ్యపేట సీఐ జానకిరామ్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌నాయుడు, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, వైద్యాధికారి పి.ఇందిర, ఆలయ ఈఈ వైకుంఠరావు, విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు, పాలకవర్గ సభ్యులు, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం

పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామని ఆలయ ఈఓ కే రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అన్నారు. ఆలయ ఛాంబర్‌లో చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి రంగుల మహోత్సవం, తిరునాళ్లకు సంబంధించి పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఫిబ్రవరిలో జరిగే రంగుల మహోత్సవం, తిరునాళ్లకు సంబంధించి రూ. 1.61 కోట్లతో చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమమే లక్ష్యం


గ్యాస్ కనెక్షన్‌లను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీ

జయంతి(వీరులపాడు): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలో ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం పొందే వీలుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు దుర్గాపురంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు వీధులను సందర్శించి త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మున్సిపల్ ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో

చిల్లకల్లు(జగ్గయ్యపేట): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత 106/2 హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గురువారం జయహో రథసారధి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ చట్టం అమలులోకి వస్తే వృత్తి సాగించడం భారమవుతుందని కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు ఆధునికీకరణ పనుల పరిశీలన

నందిగామ టౌన్: పట్టణంలో నూతనంగా చేపట్టిన జగనన్న వాక్ వే, ఓపెన్ జిమ్, బాబు జగ్జీవన్‌రామ్ భవన ఆధునికీకరణ పనులను గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 60 లక్షలతో డ్రైన్‌తో పాటు వాక్‌వే, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రూ. 22 లక్షలతో బాబు జగ్జీవన్‌రామ్ భవనాన్ని ఆధునికీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కరిముల్లా, హరిబాబు, యాకుబ్‌అలీ, కమిషనర్ జయరాం, ఏఈ ఫణిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ సమావేశం

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆర్డీఓ పి.సాయిబాబు పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు

నందిగామ: అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ వద్ద ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను గురువారం ఏసీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలించినా, ఎటువంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తున్నా వాహనాలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా నిఘా

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేసినట్లు ఏసీపీ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు. పెద్దాపురం గ్రామ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద నిఘాను పెంచామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలు చట్టరీత్యా నేరం

నందిగామ: కోడిపందేలు చట్టరీత్యా నేరమని ఇన్‌స్పెక్టర్ హనీష్ పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరిగ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, గుండాట, జూదం, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిషేధించడం జరిగిందన్నారు. ఎవరైనా ఇటువంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గ మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల: కంచికచర్లకు చెందిన వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు కంచికచర్లకు చెందిన జల్లి ఏసయ్య(43) అనే వ్యక్తికి షుగర్ వ్యాధి ఉంది. షుగర్ తగ్గదేమోనని మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోల్‌సేల్ వ్యాపారానికి కేరాఫ్ నందిగామ


నందిగామ పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి మెయిన్ బజార్

నందిగామ: హోల్‌సేల్ వ్యాపారానికి నందిగామ పట్టణం ప్రస్తుతం కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. కొద్ది సంవత్సరాల క్రితం సాదాసీదాగా ఉన్న నందిగామ పట్టణం ప్రస్తుతం అంచలంచెలుగా విస్తరిస్తోంది. హోల్‌సేల్ వ్యాపారాలు, కార్పొరేట్ ఆసుపత్రులు, పాఠశాలలు ఇలా అనేక రకాలుగా నందిగామ రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది.

పట్టణ జనాభా

అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం నందిగామ పట్టణ జనాభా 58,342 వేల మంది ఉన్నారు. ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న నందిగామ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ నేడు మున్సిపాలిటీగా ఉంది. ప్రస్తుతం నందిగామ 27.5 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించింది.

ప్రధాన వ్యాపార కూడలిగా నందిగామ

ఒకప్పుడు నందిగామ పట్టణం కొన్ని గ్రామాలకు మాత్రమే వ్యాపార కూడలిగా ఉండేది. నేడు పొరుగు రాష్ట్రాలకు కూడా ప్రధాన వ్యాపార కేంద్రంగా మారింది. నందిగామ కేంద్రంగా అనేక మంది హోల్‌సేల్ వ్యాపారులు కోట్ల రూపాయల లావాదేవీలు సాగిస్తున్నారు. అంతేగాకుండా అనేక కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు నందిగామలో కొలువు తీరాయి. హోల్‌సేల్ బంగారం, ఆయిల్, పలు కంపెనీల పచారీ సరుకులు ఇలా అన్ని విధాలుగా నందిగామ పట్టణం హోల్‌సేల్ వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రాబోయే రోజుల్లో నందిగామ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని పలు రంగాలకు చెందినవారు చెపుతున్నారు.

వ్యాపారాలు పెరిగాయి



నేను గత 30 ఏళ్లుగా హోల్‌సేల్‌గా వ్యాపారం చేస్తున్నాను. గతంతో పోలిస్తే నేడు నందిగామ ప్రాంతంలో అన్ని రకాల వ్యాపారాలు పెరిగాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

– టి రామకృష్ణ

అన్ని విధాలుగా అభివృద్ధి



నందిగామ పట్టణం గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా విద్య, వైద్య, రంగాలతో పాటు వ్యాపారంలో కూడా రోజురోజుకు వృద్ధి చెందుతోంది. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– పి.దేవసహాయం